www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 7 మే 2024 12 పేజీలు







తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

డబుల్ ఇంజిన్ సర్కారు అవసరం

- ఎన్‌డిఎ కూటమితోనే అభివృద్ధి సాధ్యం
- ప్రజాగళం వికసిత భారత్ సభలో ప్రధాని మోడీ
- ప్రత్యేకహోదా, విభజన హామీలపై ఊసెత్తని వైనం

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కారు అవసరమని ప్రధాని మోడీ అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై మాట కూడా మాట్లాడలేదు. పోలవరానికి రూ.15వేల కోట్లు అందించామన్న ప్రాని, పోలవరం నిర్వాసితుల కోసం కనీస ప్రస్తావ తేలేదు. అభివృద్ధి కుంటుపడిందన్న ఆయన రాష్ట్ర అభివృద్ధికి ఏమి ఇచ్చారో చెప్పలేదు. ఎలాంటి వరాలు హామీలు ఇవ్వకుండానే ప్రసంగాన్ని ముగించారు. దీంతో ప్రజలు, మిత్రపక్షాల్లో నిరాశనెలకొంది.

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సోమవారం రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో నిర్వహించిన ప్రజాగళం - వికసిత రాష్ట్రం, వికసిత భారత్ ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌డి కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. చంద్రబాబు పాలనలో అవిభక్త ఆంధ్రప్రదేశ్‌ను పట్టాలెక్కించారని గుర్తు చేశారు. వైసిపి పాలనలో అభివృద్ధి ఐదేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యంగా ఉంటే అవినీతి, అక్రమాలు మాత్రం నూరు శాతంగా ఉన్నాయన్నారు. అక్రమాలపై దృష్టిపెట్టిన వైసిపి సర్కారు రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం కావడానికి తగిన చర్యలు తీసుకోలేకపోయిందని విమర్శించారు. మద్య నిషేధం అని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం షాపులను తానే నిర్వహించిందని గుర్తు చేశారు. ఎన్‌డిఎ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు యావత్ భారత దేశాన్ని ప్రపంచ చిత్ర పటంలో సగర్వంగా నిలబెట్టిన వ్యక్తి మోడీ అన్నారు. ప్రధాన మంత్రి చేస్తున్న పథకాలను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తన పథకాలుగా పేరు మార్చి ప్రచారం చేసుకుంటుందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని వైఎస్ఆర్ బీమీగా మార్చారన్నారు. ప్రీమియం చెల్లించకుండా రైతుల్ని ముంచారన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి నుంచి కేంద్రం నిధులు విడుదల చేసినా రైతుల్ని నష్టపరిచారన్నారు. కేంద్రం నుంచి చిన్న బిడ్డలకు మధ్యాహ్నం ఉచిత భోజనం ఇస్తుంటే దాన్ని వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద మార్చుకున్నారని తెలిపారు. మిషన్ వాత్సల్య, శక్తి పథకాలను జగనన్న గోరుముద్ద, జగనన్న పాలు అంటూ రాష్ట్ర పథకాలుగా మార్చుకున్నారు. జగన్ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను ఇళ్లకు మళ్లించడంతోపాటు పేదల గృహ నిర్మాణానికి కేంద్రం ఇస్తున్న రూ. లక్షా 80 వేలతో ఇళ్లు కట్టించి జగనన్న కాలనీలుగా పేరు పెట్టుకున్నారన్నారు. టిడిపి, జనసేన కూటమి ఎన్‌డిఎతో కలిసి వికసిత్ భారత్ వైపు అడుగులు వేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం పేరులోనే రాజసం ఉందన్నారు. గోదావరి జిల్లాల ప్రజలకు మంచి మనస్సు ఉంటుంది. మీ మమకారం, వెటకారం రెండూ సూపర్, నరేంద్ర మోదీ గారు మన ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం ఖాజా రుచిచూడాలని కోరుతున్నా అన్నారు. చంద్రబాబు అనుభవంతో విభజన అనంతరం రాష్ట్ర పరిస్థితులను చక్కదిద్దారన్నారు. అమరావతి నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. పోలవరాన్ని జెట్ స్పీడ్‌తో 72 శాతం పూర్తి చేశారని తెలిపారు. మోడీ సహకారంతో అనేక జాతీయ సంస్థలను రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. విశాఖను ఐటి హబ్‌గా, రాయలసీమను ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ హబ్‌గా, గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా ఇలా ప్రతి జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేశామన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ దుష్ట పాలన అంతానికి, ప్రజా కంటకుల్ని గద్దె దించడానికి నడుబిగించి బిజెపి, జనసేన, టిడిపిలు ముందుకు వచ్చాయన్నారు. ఈ కలయికలో మోడీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్ కళ్యాణ్ శక్తి ఉన్నాయనానరు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన చూడాలంటే ఎన్‌డిఎ కూటమిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ప్రధాన మోడీ, పురంధేశ్వరి, లోకేష్, పవన్ కళ్యాణ్

తాగునీటి కోసం ఇక్కట్లు

ప్రధాని సభకు వచ్చిన ప్రజలు తాగునీటి కోసం అల్లాడారు. భద్రతా కారణాల రీత్యా వాటర్ బాటిళ్లను సభా ప్రాంగణంలోకి పోలీసులు అనుమతించలేదు. నిర్వాహకులు సైతం లోపల తాగునీటిని సమకూర్చడంలో విఫలమవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్


నేటి నుంచి జిల్లా స్థాయి పోస్టల్ బ్యాలెట్

పిఆర్ కళాశాలలో ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగి, కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పించి, పూర్తి అవగాహనతో వినియోగించుకునేలా చూడాలని కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు, ఓటింగ్‌కు హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 7, 8 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకట్రావు ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియలో పాల్గొంటున్న పోలింగ్ సిబ్బంది పోలింగ్ నిర్వహణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎటువంటి గందరగోళానికి తావులేకుండా చూడాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఉద్యోగుల నియోజకవర్గం, బ్యాలెట్ సీరియల్ నెంబర్ వివరాలను స్పష్టంగా కవర్లపై రాయాలన్నారు. పోలింగ్ సిబ్బంది పర్యవేక్షణలోనే ఓటు వేసే ఉద్యోగులు సంతకం పెట్టించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహణపై సిబ్బంది అన్ని అంశాలపై అవగాహన కల్పించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ అంతా సవ్యంగా సాగిందని ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తలేదని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ డాక్టర్ డి.తిప్పేనాయక్, సిపిఒ పి.త్రినాథ్, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి పి.శ్రీనివాసరావు, పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.తిరుపాణ్యం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కానీ...పాఠాలు చెప్పేవారే లేరు.!!

ప్రధాన సమస్యలు గాలికి...

- మౌలిక వసతులూ లేక ప్రజలు ఇక్కట్లు
- ప్రచారంలో వాటి ఊసెత్తని వైసిపి, కూటమి అభ్యర్థులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

400 గ్రామాలను దత్తత తీసుకుని రూ.400 కోట్లు ఖర్చు చేస్తానంటూ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసిపి కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ హామీ ఇస్తున్నారు. విశాఖ నుంచి సామర్లకోట వరకు వయా తుని లోకల్ ట్రైన్ అవసరం ఉందని కాకినాడ ఎంపీగా గెలిచిన వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి లోకల్ ట్రైన్ తీసుకొస్తామని జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇస్తున్నారు. ఇలా అమలు సాధ్యానికి తక్కువ అవకాశాలు ఉన్న హామీలను ఇస్తున్న అభ్యర్థులు దీర్ఘకాలంగా జిల్లా వాసులను వేధిస్తున్న సమస్యలను మాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న 56 సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని అనేకేళ్లుగా గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద మల్లాపురం కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నాన్ షెడ్యూల్‌లో ఉన్న ఈ మండలాల్లోని గిరిజన గ్రామాల్లో అంతా షెడ్యూల్ తెగలకు చెందిన వారే జీవనం సాగిస్తున్నారు. స్వాతంత్ర్య వచ్చి 70 ఏళ్లు దాటుతున్నా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కానరాక గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు. కనీసం కుల ధ్రువీకరణ పత్రం పొందాలన్నా తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రధాన సమస్యను ఇటు వైసిపి, అటు టిడిపి, జనసేన నాయకులు మరచిపోయారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ లేక రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రజలు వరద ముంపు సమస్యతో ఏటా ఇబ్బందులు పడుతున్నారు. గత టిడిపి ప్రభుత్వం సహా ఇప్పటి వైసిపి కూడా ఏలేరు, సుద్ధగడ్డ ఆధునికీకరణకు హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలుకి వచ్చిన జగన్ హామీ ఇచ్చి రెండేళ్లు దాటుతున్నా అమలుకు నోచుకోలేదు. కాపు నేస్తం సభలో పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీలకు రూ. 40 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించి మాట మరిచారు. ఇప్పుడు ఆ నిధుల మాట నేతలు మర్చిపోయారు. విశాఖ-కాకినాడ మధ్య పెట్రో రసాయనాల పెట్టుబడుల కేంద్రం వస్తుందని కాకినాడ జిల్లా వాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు.



గతేడాది వర్షాలకు నీట మునిగిన కాకినాడలో ఓ వీధి

కాకినాడ సెజ్ లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. జిల్లా వాసుల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే జల్ జీవన్ మిషన్ పనులకు గత బడ్జెట్ లో నిధులను కేటాయించినా పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు. జిల్లాలో పలు రహదారుల ఛిద్రంగా దర్శనమిస్తున్నాయి. గతంలో నిధులను కేటాయించామని ప్రభుత్వం చెప్పిన నేటికీ పరిస్థితిలో మార్పు లేదు. గత టిడిపి ప్రభుత్వ హయం నుంచి ఈ సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. కాకినాడ సిటీలో గుడారిగుంట, రేచర్ల పేట, కొత్త కాకినాడ, సంజయ్ నగర్, దుమ్ములపేట, పర్లో పేట, చిన్న 2లో..

అభ్యర్థుల పేర్లు, గుర్తులపై గందరగోళం

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

సార్వత్రిక ఎన్నికలకు నిడదవోలు నియోజకవర్గంలో ఎంఎల్ఎ అభ్యర్థులుగా 12 మంది బరిలో నిలిచారు. వీరిలో కొందరి ఇంటి పేర్లు, పేర్లు ఒకేలా ఉండడం ఓటర్లకు అయోమయం కలిగించనుంది. అధికార వైసిపికి చెందిన ఎంఎల్ఎ అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు సీలింగ్ ఫ్యాన్ గుర్తుతో, స్వతంత్ర అభ్యర్థిగా శ్రీనివాస నాయుడు గిద్దా హాకీ, బాల్, వెంకటేశ్వర నాయుడు గిద్దా కరెంటు స్తంభం గుర్తులపై పోటీ చేస్తున్నారు. నవరంగ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంచర్ల దుర్గేష్ గుర్తు బకెట్. ఇది జనసేన, ఉమ్మడి పార్టీల అభ్యర్థి కందుల దుర్గేష్ గుర్తు గ్లాసును పోలి ఉంటుంది. ఇద్దరి పేర్లు దుర్గేష్ కావడం, వీరి ఇంటి పేర్లు కూడా ఒకేలా ఉన్నాయి. పైగా ఇవిఎం మిషన్‌లో ఇద్దరి నెంబర్లు 6, 7 లోనే కనిపిస్తాయి. గుర్తు మరిచిన ఓటర్ల పేరుతో తికమకగా, పేరు మరచిన ఓటర్లు గుర్తుతో సతమతమయ్యే సమస్య కనబడుతోంది. సమస్య చిన్నగా ఉన్నా ఫలితాలు తారుమారయ్యే అవకాశం లేకపోలేదు.



సమావేశంలో మాట్లాడుతన్న బిసి నరాయకుడు శేషగిరి రావు

వైసిపి బిసి నేతల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- అమలాపురం

అల్లవరం మండలం గుత్తులవారిపాలెంలో వైసిపి బిసి సెల్ మండల అధ్యక్షుడు యల్లమిల్లి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇళ్ల శేషగిరిరావు, గుత్తుల మనోహరరావు మాట్లాడారు. అమలాపురం నియోజకవర్గంలో శెట్టిబలిజలు వైసిపికి వ్యతిరేకంగా ఉన్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని, కొంతమంది పనిగట్టుకుని విషప్రచారం చేస్తున్నారని అటువంటి ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వైసిపి శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సీట్లు కేటాయిం చిందన్నారు. మంత్రి విశ్వరూప్‌ను ఐక్యంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయుడు విష్ణుమూర్తి, మల్లాడి ఉమామహేశ్వరరావు, కడలి గంగాచలం, గుబ్బల రంగనాథ స్వామి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, శ్రీరామ్, కుడిపూడి సూర్యప్రకాష్ వాసంశెట్టి నరసింహారావు, దొమ్మేటి సురేష్, చెల్లుబోయిన రమేష్, చొల్లంగి బాబి పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్ ఫిర్యాదులపై చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను యాప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. సీ విజిల్ యాప్ ద్వారా పౌరుల నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై అందిన ఫిర్యాదులు రోజువారీ నివేదిక ప్రకారం మే 5న 51 ఫిర్యాదులు అందగా వీటిలో 46 ఫిర్యాదులను 100 నిమిషాల్లోపు పరిష్కరించామన్నారు. రెండు ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన కావని ధ్రువీకరించారు. 3 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మార్చి 16వ తేదీ నుండి మే 5 వరకు 693 ఫిర్యాదులు రాగా వాటిలో 124 ఫిర్యాదులు నియమావళికి సంబంధించినవి కావని, 569లో 531 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మార్చి 16 నుంచి మే 5 వ తేదీ వరకు 44 ఫిర్యాదులు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వెలగపూడి నుండి అందాయని వీటిలో 37 ఫిర్యాదులను పరిష్కరించామని, ఏడు ఫిర్యాదులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం చినకొండేపూడి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు చేస్తూ కరక త్రిమూర్తులు (46) అనే వ్యక్తి పని చేస్తూనే గుండె పోటుకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడానికి సన్నాహాలు చేస్తుండగా మృతి చెందారని ఎపిఒ నాగశేషవేణి తెలిపారు.

అభివృద్ధిపై యంత్రాంగం పర్యవేక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - ఆలమూరు

అభివృద్ధి పనులపై ప్రభుత్వ అధికార యంత్రాంగం పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఎంపిడిఒ ఎ.మేరీ రోజ్ ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి పరిధిలోని అభివృద్ధిపై వివరాలు తెలిపారు. దీనిలో జొన్నాడ, గుమ్మిలేరు ఆర్ అండ్ బి రహదారికి చేపట్టిన మరమ్మతులపై ప్రశ్నించగా ఆ శాఖ ఎఇ అందుబాటులో లేకపోవడంతో అంశాన్ని వాయిదా వేశారు. కడియం, వెదురుమూడి రహదారిపైన చర్చించారు. ఆ రహదారులకు మరమ్మతులు పూర్తిచేసిన నెల రోజులకే యథాస్థితికి చేరుకుంటున్నాయని, శాశ్వత పనులు చేయడం లేదని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. నీటిపారుదల శాఖ ఎఇతో శివారు భూములకు సాగునీరు అందించడంలో వైఫల్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు ఉపాధిహామీ పథకం ద్వారా కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క వంటివాటిని తొలగించాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఒఆర్ఎస్ ప్యాకెట్స్ నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ శాఖ అంతరాయాలను అధిగమించాలని ఎఇకి ఆదేశించారు. మిగిలిన విషయాలపై సాదాసీదాగా సమావేశం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, మండల పరిషత్ ఎఒ రామ స్వరూప్, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎఇ శ్రీలక్ష్మి



బంక్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ అప్పారెడ్డి

పెట్రోల్ బంకు ప్రారంభం

ఆలమూరు : జొన్నాడ సమీపాన 216 జాతీయ రహదారి ప్రక్కన సోమవారం పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. సూర్య ఫ్యూయల్ స్టేషన్‌ను ప్రముఖ వ్యాపారి ఏర్పాటు చేయగా మాజీ సర్పంచ్ ద్వారంపూడి అప్పారెడ్డి ప్రారంభించారు. దీంతో చుట్టుపక్కల పలువురు రైతులు ఫ్యూయల్ స్టేషన్ మరింత దగ్గరగా అందుబాటులోకి తీసుకు రావడంతో వ్యాపారిని అభినందించారు. పలువురు ప్రముఖులు హాజరై తమ శుభాకాంక్షలు తెలిపారు.

హోమ్ ఓటింగ్ కోసం 1,251 మంది ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లావ్యాప్తంగా మంగళవారం నుండి ప్రారంభంకానున్న హోమ్ ఓటింగ్ కోసం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,251 మంది అర్హత సాధించగా వీరి హోమ్ ఓటింగ్ కోసం 73 బృందాలను నియమించి 85 రూట్లుగా విభజించి 85 వాహనాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలో 172 మంది హోమ్ ఓటింగ్‌కు అర్హత సాధించగా వీరి ఓటింగ్ కోసం ఆరు బృందాలను నియమించి, ఆరు రూట్లుగా విభజించి ఆరు వాహనాలను ఏర్పాటు చేశారు. మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 260 మంది హోమ్ ఓటింగ్ అర్హత పొందగా వీరు ఓటింగ్ కోసం 20 బృందాలను నియమించి 20 రూట్లుగా విభజించి 20 వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 65 మంది హోమ్ ఓటింగ్‌కు అర్హత పొందారు. వీరి ఓటింగ్ కోసం ఏడు బృందాలను నియమించి ఏడు రూట్లుగా విభజించి ఏడు వాహనాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 421 మంది హోమ్ ఓటింగ్ అర్హత పొందగా వీరి ఓటింగ్ కోసం 14 బృందాలను నియమించి 14 రూట్లుగా విభజించి 14 వాహనాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గంలో 63 మంది హోమ్ ఓటింగ్‌కు అర్హత పొందగా వీరి ఓటింగ్ కోసం ఆరు టీములను నియమించి ఆరు రూట్లుగా విభజించి ఆరు వాహనాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 161 మంది హోమ్ ఓటింగ్ కోసం అర్హత పొందగా వీరి ఓటింగ్ కోసం 12 బృందాలను నియమించి 24 రూట్లుగా విభజించి 24 వాహనాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 109 మంది హోమ్ ఓటింగ్ అర్హత సాధించగా వీరి ఓటింగ్ కోసం ఎనిమిది బృందాలను నియమించి ఎనిమిది రూట్‌లుగా విభజించి ఎనిమిది వాహనాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రధాన సమస్యలు గాలికి...

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్ ఏరియా, రామకష్ణారావుపేట, ఏటి మొగ తదితర ప్రాంతాలు వర్షాకాలంలో నిత్యం ముంపునకు గురవుతున్నాయి. అనేకేళ్లుగా ఈ సమస్య ఉన్నా టిడిపి, వైసిపిలు పట్టించుచుకోలేదు. ప్రచారంలో సైతం ఈ సమస్యపై మాట్లాడట్లేదు. గ్రామాల విలీనం అంశం ఇంకా నలుగుతూనే ఉంది. తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట గ్రామాలు, టీచర్స్ కాలనీ, గంగనాపల్లి పరిధికి చెందిన 42, 46 డివిజన్ ప్రాంతాల విలీనం కేసులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇలా కాకినాడ జిల్లాలో అనేక ప్రధాన సమస్యలు దీర్ఘకాలికంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

మేనిఫెస్టో అంశాలకే పరిమితం

అభ్యర్థులు వారివారి మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలనే ప్రచారం చేస్తున్నారు. వైసిపి అభ్యర్థులు నవరత్నాలు అంటుంటే, టిడిపి, జనసేన అభ్యర్థులు సూపర్‌సిక్స్ అంటూ ప్రచారంలోకి వెళ్తున్నారు. ఓట్లు అడుగుతున్న క్రమంగా ప్రజలు స్థానిక సమస్యలను ప్రస్తావిస్తున్నా ప్రధాని పార్టీ అభ్యర్థులు దాటవేట ధోరణితో వ్యవహరిస్తున్నారు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలపై కనీసం స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారం నిర్వహించిన పవన్ కళ్యాణ్ జిల్లాలో కొన్ని సమస్యలపై తూతూ మంత్రంగానే హామీ ఇచ్చారు. ఏలేరు ఆధునికీకరణకు కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే నిధులు కేటాయించేలా కషి చేస్తానని, సముద్రపు కోత నివారణకు,సెజ్ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు, మూతబడిన షుగర్ పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తానని ఆయా ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల సభల్లో ఆయన హామీ ఇచ్చి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

సూర్యారావుపాలెంలో కందుల ప్రచారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావుపాలెంలో సోమవారం ఎన్నికల ప్రచార జన చైతన్య రథయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావుతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రమాదానికి గురియైన మార్లపూడి రాజును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లేపల్లి రాజా, సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ళ బాలాజీ, నందిన శ్రీనివాస్, మద్దుకూరి శ్రీమన్నారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు గురజర్ల వెంకటలక్ష్మి, వార్డు సభ్యురాలు గురజర్ల అరుణ కుమారిలతో కలిసి వైసిపి అభ్యర్థి విజయం కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి శ్రీనివాస్ నాయుడును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొడవటి సూరి పండు, కొమ్మర రమేష్, జుత్తిగ శివ, ఎంపీటీసీ గడ్డం రామకృష్ణ, పాల్గొన్నారు.



బాధితుని పరామర్శిస్తున్న జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్

మంత్రి వనిత ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కోమటికుంట, వెదుళ్ళకుంట, వాదాలకుంట, గోపాలపురం గ్రామాలలో మంత్రి తానేటి వనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ర్యాలీలో భాగంగా జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలు విజ్ఞతతో ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, వెలగా శ్రీరామామూర్తి, ప్రమీల కుమారి, కూసం రామ్మోహన్ రెడ్డి, వల్లభనేని సత్యనారాయణ, బండి కనకదుర్గ, కె.లలిత, ఎండపల్లి కవిత, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులకు శిక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు ఒక ఏడాది సాధారణ జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ముమ్మిడివరం జూనియర్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ సోమవారం తీర్పునిచ్చింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని నక్కా పేటకు చెందిన ఒక మహిళ అదే గ్రామానికి చెందిన నక్కా చిట్టి బాబు, నక్కా శ్రీనివాసరావు, నక్కా రాజశేఖర్, వరసాల బాల, జిత్తుక సూరమ్మ, నక్కా లావణ్య, నక్కా లక్ష్మిలు బాధితురాలిపై దాడి చేసి బెదిరించి, గాయపర్చినట్లు చేసిన ఫిర్యాదు మేరకు 2018లో ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించగా మేజిస్ట్రేట్ ముద్దాయిలకు శిక్షలను ఖరారు చేస్తూ తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.



గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కాన్వాయ్‌పై దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - పిఠాపురం

గొల్లప్రోలు మండలం తాడిపర్తి గ్రామంలో సినీనటుడు సాయిధర్మ తేజ్ కాన్వాయ్‌పై దాడి ఘటనలో గాయపడిన బాధితుడు ఎన్.శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు కారకులైన గ్రామానికి చెందిన యు.వెంకటరమణ, యు.వీరబాబులను అరెస్ట్ చేసి కోర్ట్‌లో హాజరు పరిచినట్లు వెల్లడించారు.

గ్రామంలో పోలీస్ పికెట్

తాడిపర్తి గ్రామంలో పవన్ కళ్యాణ్ మద్దతుగా ప్రచారం చేస్తున్న సుప్రీమ్ హీరో సాయిధర్మ తేజ్ కాన్వాయ్‌పై దాడి నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ట్రైని డిఎస్‌పి ప్రమోద్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలందరూ ఎటువంటి భయభ్రాంతులకు గురికావలసిన అవసరం లేదన్నారు. గ్రామస్తులంతా సమన్వయం పాటిస్తూ సహకరించాలని కోరారు.

620 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ మూడో రోజు సోమవారం 620 మంది వినియోగించుకున్నారని ఆర్ఒ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక బిఎంఆర్ ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ నేటికి 1827 మంది వినియోగించుకున్నారని, మరో రెండు రోజులు పోస్టల్ బ్యాలెట్ కు అవకాశం ఉందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వైసిపిలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి వేణు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రూరల్ మండలం ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన పలువురు మైనారిటీ నాయకులు ఎండి హమీద్ భాషా ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి వైసిపి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైసిపి రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరికి సంక్షేమం అందించామన్నారు. పార్టీ తరపున ప్రతి ఒక్కరూ ఇంటింటి ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బొక్కా ప్రసాద్, మాజీ కార్పొరేటర్ మెరపల శ్యామలరావు, తలారి ప్రసాద్, బడేటి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌పి అభ్యర్థి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - నిడదవోలు

మండలంలోని ఎన్టీఆర్ కాలనీ, ఇందిరా నగర్, రాయిపేటబసివిరెడ్డి పేటల్లో బిఎస్‌పి అభ్యర్థి చిత్రసేను సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రసేను మాట్లాడుతూ రాష్ట్రంలో చట్ట బద్ధమైన పరిపాలన అమలుకావడం లేదని, అధికారం లో ఉన్న పార్టీలకు చట్టాలు వర్తించవని, నిబంధనలు ఉల్లంగించినా అధికార యంత్రాంగం చూసీచూడనట్టు వ్యాహరిస్తుందన్నారు. అందువల్లే అధికార పార్టీలకు చెందిన కార్యకర్తలు అధికార యంత్రాంగాలను లెక్కచేయని పరిస్థితి నెలకొందన్నారు. బిఎస్‌పి పాలనలో సొంత పార్టీ కార్యకర్తలు కూడా చట్టానికి లోబడి పనిచేయవలసిందేనని, లేకపోతే పార్టీ నుండి సస్పెండ్ చేస్తారని అన్నారు. బిఎస్‌పి వంటి క్రమశిక్షణ కలిగిన పార్టీ కి ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ పర్యటనలో నల్లి. రమేష్, బయ్యే మునీంద్ర, కప్ప ఇశ్రాయిల్, మల్లపు నాగరాజు, గొల్ల ధనరాజు, మోర్త చింతరాజు, తాడేపల్లి మహరధి కర్ణ, గంగులూరి రమేష్ పాల్గొన్నారు.



రోడ్డు షో నిర్వహిస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు, ఇతరులు

తాళ్లపూడిలో ముప్పిడి ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తాళ్లపూడి గ్రామంలో టిడిపి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు రోడ్డు షో నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టిడిపి మండల శాఖ అధ్యక్షులు నామన పరమేశ్వర రావు ఉమ్మడి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రెండు గ్రామాల్లో ముప్పిడి వెంట భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గంటా కృష్ణ, ఐతం మణికంఠ, జి.ప్రసాద్, గోలి మణికంఠ, ఐ.రామకృష్ణ, కలిసెట్టి నాయుడు పాల్గొన్నారు.

పీపుల్స్ మేనిఫెస్టో కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం

జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యాన సోమవారం అమలాపురంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం పీపుల్స్ మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక పట్టణ యూనిట్ గౌరవాధ్యక్షుడు దంగుడుబియ్యం శ్రీరామూర్తి మాట్లాడారు. మన ప్రజాస్వామిక రాజ్యాంగ హక్కును వినియోగించుకుందామని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వాతావరణ పరిస్థితులకు అతీతంగా ఉత్సాహంగా వినియోగిద్దామని తెలిపారు. నాణ్యమైన శాస్త్రీయమైన విద్య, వైద్యం అందరికీ అందించేలా, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడేలా అభ్యర్థులను కోరాలని, అలాచేసే వారికే ఓట్లు వేసి మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా ప్రజలు అందరూ పూనుకోవాలనీ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ అన్నారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, శాస్త్రీయ దక్పథం పరిరక్షించే వారికే మన మద్దతు ఉంటుందన్నారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జివి.గోపాలకృష్ణ, ఉపాధ్యాయ జిల్లా నేత పి.వెంకటేశ్వరరావు, పి.భాస్కరరావు, జన విజ్ఞాన వేదిక నాయకుడు బిఎన్.వెంకటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

రక్తహీనత వ్యాధితో బాధపడుతున్న రాజమహేంద్రవరం వేమన వీధికి చెందిన 3 సంవత్సరాల బాలిక ప్రత్యక్ష వర్ధినికి పెద్దాపురం మిషన్ అన్నపూర్ణ స్వచ్ఛంద సంస్థ సహాయ నిధి నుంచి సోమవారం రూ 1,03,500 ఆర్థిక సాయం అందచేశారు. సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విజయ జ్యుయలర్స్ షాపు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు దేవత రాజేష్‌కుమార్ మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో సంవత్సరం పొడవునా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రౌతు గోవింద్, విజయలక్ష్మి, దాడి శివాజీ, మట్టే శ్రీనివాసరావు, గొల్లపల్లి రేవంత్ కిషన్, మొల్లి శాంతి, సందీప్ పాల్గొన్నారు.



చిన్నారి కుటుంబానికి నగదును అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

నిర్మానుష్యంగా జాతీయ రహదారి

ప్రజాశక్తి - గండేపల్లి

రోజు రోజుకి పెరుగుతున్న ఎండ తీవ్రత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత కన్పించడంతో వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకుంది. మధ్యాహ్నం 11 గంటలకే జాతీయ రహదారి సైతం నిర్మానుష్యంగా మారిపోతుంది.



జాతీయ రహదారిపై ఒక్క మనిషి కన్పించని వైనం



రోడ్డు షోలో మాట్లాడుతున్న ఎంపి బాబూరావు

తాళ్లపూడిలో రోడ్డు షో

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని గజ్జరం, తిరుగుడుమెట్ట గ్రామాల్లో వైసిపి కొవ్వూరు నియోజకవర్గం అభ్యర్థి తలారి వెంకట్రావు రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజలందరికీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఆ పథకాలు తిరిగి అందాలంటే రానున్న ఎన్నికల్లో ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎంఎల్ ఎగా తలారి వెంకట్రావులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, ఎంపిటిసి సభ్యులు జి.చిన్న బ్బులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మల్లవరం ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని మల్లవరం గ్రామంలో రెండవ రోజు వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట శ్రీరాంజీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంఎల్‌ఎగా తోట నరసింహాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నాడ దిగజారుడు వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి - కాట్రేనికోన

ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ తన సామాజిక వర్గం తప్ప మిగతా కులాలన్నీ జాతి నీతి లేని కులాలంటూ వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని టిడిపి జిల్లా కార్యదర్శి రేవు రమేష్ దుయ్యబట్టారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పల్లం గ్రామంలో జరిగిన మత్స్య కారులు సమావేశంలో పొన్నాడ మాట్లాడుతూ జాతి నీతి ఉన్న ఏకైక కులం మత్స్యకారులేనని పరోక్షంగా మిగతా కులాలుజాతిని పరుష పదజాలంతో మాట్లాడడం సిగ్గు చేటు అన్నారు. తన జాతి గొప్పదే అని చెప్పుకోవడం లో తప్పు లేదని, తన జాతే గొప్పదనుకోవడం అవివేకమని అన్నారు. రెండు దఫాలు ఎంఎల్‌ఎగా ఎన్నికయిన పొన్నాడ తన నిజస్వరూపం బయటపెట్టారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఇప్ప టికైనా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని టిడిపి ఎస్‌సి సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యాలు ప్రసాద్ డిమాండ్ చేశారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.10 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ శాశ్వత నిత్యాన్న దాన ట్రస్ట్‌కు ఉప్పలగుప్తం మండలం ఎన్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఉయ్యూరి రాజారత్నం జ్ఞాపకార్థం భర్త రామారావు, కుమారుడు వీర వెంకట సత్యనారాయణ మూర్తి రూ.10 వేలు విరాళాన్ని అందచేశారు. ప్రతి ఏటా వైశాఖ మాసం శుద్ధ దశమి రోజున అన్నదానం జరిపించాలని కోరుతూ విరాళాన్ని సోమవారం అందచేశారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంథి మాధవి తెలిపారు. దాత దంపతులకు అర్చకులు మరియు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదంలు అందజేశారు.

71.67 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం, కొత్తపేట

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ రెండో రోజైన సోమవారం నియోజక వర్గ పరిధిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో రెండో రోజు 71.67 శాతం నమోదు అయ్యింది.ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జడ్‌పి బాలికోన్నత పాటశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో తొలి రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు బారులు తీరారు. నియోజక వర్గానికి సంబంధించి 1560 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవలసి ఉండగా తొలి రోజు 656 (42.84 శాతం) మంది, రెండో రోజు 462 మంది మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకావడంతో 71.67 శాతం మంది పోస్టల్ ఓటును వినియోగించుకున్నారు. 7న కూడా ఫెసిలిటేషన్ సెంటర్ లో ఓటు వినియోగించుకోవచ్చునని, అప్పటికి ఎవరైనా పోస్టల్ బ్యాలెట్ ఓటును వేయకపోతే, 8న ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటును సద్వినియోగం చేసుకోవచ్చునని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

కొత్తపేట నియోజకవర్గంలో...

కొత్తపేట నియోజకవర్గంలో రెండవ రోజు సోమవారం 550 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆర్‌ఒ జివి.సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు మిగిలిన వారు మంగళవారం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

వేమగిరిలో మంత్రి వేణు ప్రచారం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వేమగిరి గ్రామంలోని వేమగిరి తోట, సుబ్రహ్మణ్యం స్వామి గుడి సెంటర్ తదితర ప్రాంతాల్లో సోమవారం రాత్రి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ వారం రోజుల్లో ఎపిలో కురుక్షేత్ర మహాసంగ్రామం జరగబోతోందని, వైసిపికి ఓటేసి గెలిపిస్తేనే పథకాలు కొనసాగుతాయన్నారు. చంద్రబాబుకు ఓటువేయడం అంటే కరువు స్వాగతించడమేనని అన్నారు. ఈ ఎన్నికలు కేవలం ఎంపీలు, ఎంఎల్‌ఎలను ఎన్నుకోవడం మాత్రమే కాదని, ఐదేళ్ల మీ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు అని తెలిపారు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే.. పథకాలన్నీ ముగిసిపోయి నట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా జమీందార్, నరాల గణపతి, గుబ్బల నాగార్జున, వెలుగుబంటి అచ్యుత రామ్, తాడాల చక్రవర్తి, నరాల శ్రీను, అల్లంపల్లి శ్రీను, కోళ్ళ నాగేశ్వరరావు, పితాని శ్రీను పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

పోలింగ్ సమయానికి వ్యవధి కేవలం ఏడు రోజులు మాత్రమే ఉండటంతో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. అభ్యర్థులతోపాటు, వారి వారి కుటుంబ సభ్యులు ఆయా పార్టీల శ్రేణులతో కలిసి ప్రచారాన్ని సాగిస్తున్నారు.

కాకినాడ రూరల్లో...

కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లకు మద్దతుగా రూరల్‌మండలం గైగోలపాడులో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, పంతం సందీప్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లిలో..

మండలంలోని కొండవరం గ్రామంలో వైసిపి పిఠాపురం నియోజకవర్గ అభ్యర్థి వంగా గీతతో కలిసి వైసిపి నాయకురాలు లక్ష్మీపార్వతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జగ్గంపేటలో...

మండలంలోని బలభద్రపురం, సీతానగరం, కాట్రావులపల్లి గ్రామాల్లో టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సోమవారం తన ప్రచార రథంపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన అభ్యర్థులకు సైకిల్, గాజు గ్లాసు గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టమూరి రామకృష్ణ, మరోతి కృష్ణ, యర్ర పరమేష్, ముత్యాల సత్యనారాయణ, కోడూరి సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజి, తాతినేని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం విజయం కోసం ఆయన కుమార్తె ప్రసూన జగ్గంపేట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్, బండారు రాజా, చెరుకూరి జయరాజు, ఆకుల శ్రీధర్, గొల్లపల్లి శ్రీను, పాల్గొన్నారు.

తాళ్లరేవులో..

మండలంలోని కోరంగి పంచాయతీ మత్స్యకార గ్రామాలైన చిన బొడ్డు వెంకటాయపాలెం,పెద్ద బొడ్డు వెంకటాయపాలెంలలో సోమవారం వైసిపి ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలనికోరారు.

పెద్దాపురంలో..

వైసిపి కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ సతీమణి బిందు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలంలోని పులిమేరు, సిరివాడ గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల మోహన్, సురేష్, అచ్యుత రామయ్య, భీమలింగం సూర్యనారాయణ మూర్తి, వినుకొండ వీరవిష్ణుచక్రం, బూరాడ వీర రాఘవమ్మ పాల్గొన్నారు. అలాగే వైసిపి పెద్దాపురం అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ మండల పరిధిలోని తూర్పు పాకలు, చదలాడ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అయ్యారక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, వైస్ ఎంపిపి మిరియాల రాజా, నాయకులు మాదిరెడ్డి రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకినాడలో ...

స్థానిక 45వ డివిజన్‌లో టిడిపి కాకినాడ అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి వనమాడి కొండబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాన్ని ఓటర్లకు అందించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన అభ్యర్థులకు సైకిల్, గాజు గ్లాసు గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మల్ల వెంకటేశ్వరరావు, సుంకర రామకృష్ణ, కేలంగి ప్రసాద్, వాకాడ శ్రీనివాసరావు, మూడే రాజబాబు, దీనా అనిల్, అంకం నాయుడు పాల్గొన్నారు.

రౌతులపూడిలో...

మండలంలోని ములగపూడి గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్యబాబు సోమవారం ప్రారంభించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కరణం సుబ్రహ్మణ్యం, బాబి, నాగు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య ప్రగతి ఓటుతోనే సాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రజాస్వామ్య ప్రగతి ఓటుతోనే సాధ్యమని, అందుకు అనుగుణంగానే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఒక్క ఓటరు తన ఓటును వినియోగించుకోవాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఆర్ఒ ఇట్ల కిషోర్ పిలుపునిచ్చారు. పౌర సంక్షేమ సంఘం చేపట్టిన ఓటరు చైతన్య కరపత్రాలను నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్‌లో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ రూరల్ ప్రాంతాల ఓటర్లు మే 13న జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని పోలింగ్ శాతం పెంపు చేయాలన్నారు. పౌర సంఘం కన్వీనర్ ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ 80 శాతం పైగా ఉండే పోలింగ్ శాతం 65 శాతానికి తగ్గిపోవడం ఆందోళనకరమన్నారు. పోటీ చేసే అభ్యర్థులలో ఒకరికి ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియను బలపర్చాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల పట్ల వ్యతిరేకత ఉంటే నోటాకు ఓటు వేయాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఎన్నికల వ్యవస్థను గౌరవించాలని కోరారు. 8 నుంచి 11 వరకు నాలుగు రోజులు పాటు కాకినాడ సిటీ రూరల్‌లో ఓటు హక్కు వినియోగంపై ఓటరు చైతన్య మైకు ప్రచార యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రచారాలకు తావు లేకుండా నిర్వహించే స్వచ్ఛంద ఓటరు చైతన్య మైకు ప్రచారానికి ఎటువంటి అనుమతులు అవసరం లేదని కిషోర్ తెలిపారు.



ఆర్ఒ కిషోర్‌కు ప్రచార కరపత్రాన్ని అందిస్తున్న రమణరాజు



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ను పరిశీలిస్తున్న ఆర్ఒ

524 మంది ఓటు హక్కు వినియోగం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం లూథరన్ హైస్కూల్లో పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో సోమవారం 524 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆర్ఒ జె.సీతారామారావు తెలిపారు. 4, 5, 6 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోని వారు, 12/12 డి దరఖాస్తు చేసుకోని ఎన్నికల సిబ్బంది ఆర్ఒను సంప్రదించి ఈనెల 7, 8 తేదీల్లో ఆర్‌డిఒ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

మురుగుతో జగ్గంపేట బస్టాండ్



బస్టాండులో నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి - జగ్గంపేట

నిత్యం వేల సంఖ్యలో ప్రయాణించే ఏకైక వాహనం ఒక ఆర్‌టిసి బస్సు. ఆర్‌టిసి బస్సులో ప్రయాణం సురక్షితం సుఖవంతం, బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి అనే వాక్యం ప్రతి బస్టాండ్లలో ఉండటం సహజం. మండల కేంద్రమైన జగ్గంపేట బస్‌స్టేషన్‌లో బస్సులు బయటకు వెళ్ళు మార్గంలో మురుగు నీరు దర్శనమిస్తుంది. బస్టాండ్‌లో తాగునీటి కుళాయి ఉంది. అయితే ప్రయాణీకులు అక్కడ మంచినీరు తాగి, చేతులు కడగడంతో అక్కడ ఉన్న నీరు డ్రెయినేజీకి వెళ్ళే మార్గం లేదు. దీంతో అక్కడే వినియోగించిన నీరు నిలిచిపోతుంది. మురుగునీటిని దాటుకునే వెళ్లే క్రమంలో పలువురు జారి పడి ప్రమాదాలకు గురౌతున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధ్యాపకులకు పరిశోధనలు అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

అధ్యాపకులకు పరిశోధనలు అవసరమని ఆదిత్య యూనివర్శిటీ ప్రొఫెసర్ ఛాన్సలర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆదిత్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్‌లో పరిశోధన పత్రాలు ప్రచురించడంపై 5 రోజుల సదస్సు ప్రారంభమయ్యింది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ అధ్యాపకులందరికి పరిశోధన అవసరమని, అందరూ పరిశోధన పత్రాలను రూపొందించడంలో సుశిక్షుతులు కావాలని పిలుపునిచ్చారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి మేటి పరి శోధకులతో, పరిశోధన చేసే అధ్యాపకుల కోసం ఈ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ ఒకసారి ఏ విషయం మీదైనా ప్రయోగం చేసిన తర్వాత కనీసం 4 లేదా 5 పరిశోధనా పత్రాలను సులభంగా ప్రచు రించవచ్చుని తెలిపారు. పరిశోధనా విభాగం డీన్ డాక్టర్ కెవిఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ ఒక అధ్యాపకుడు మానవ మెదడుపై పరిశోధన చేస్తున్నారని సదస్సు దృష్టికి తెచ్చారు. మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు వెబ్ అఫ్ సైన్స్, స్కోపస్ డేటాబేస్‌ల ఉపయోగం మరియు వాటి విశిష్టతను వివరించారు. ఈ సదస్సులో తాడేపల్లిగూడెం నిట్ బిట్స్ పిలానీ, మేఘాలయకు చెందిన నిట్, కలశలింగం యూనివర్సిటీ, ఆదిత్య యూనివర్సిటీలకడు చెందిన మేటి పరిశోధకులు, ప్రొఫెసర్లు వివిధ అంశాలపై కూలంకుషంగా వివరించనున్నారని సదస్సు సమన్వయకర్త డాక్టర్ రాహుల్ భారతి వెల్లడించారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఇతరులు

వైసిపికి ఎఎంసి ఛైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ పార్టీ పదవితోపాటు, ఎఎంసి ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. సోమవారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలోని తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పి.మల్లవరం పంచాయతీ పరిధిలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయడంలో అవినీతి చేశారని, అనువుగా లేని ప్రాంతంలో ఇండ్ల స్థలాలు ఇచ్చి ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఒక బినామీ వ్యక్తితో తాళ్లరేవు మండలంలో పరిపాలన చేస్తూ కష్టపడిన కార్యకర్తలకు తీవ్ర అన్యాయం చేశారని, ఆయన పనితీరు పట్ల విసుగు చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు , అభిమానులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శివన్నారాయణ

నేటి నుంచి సమ్మర్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 7వ తేదీ నుంచి జూన్ 9 తేదీ వరకు స్థానికయాసలపు సూర్యారావు భవనంలో బాలలకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సమ్మర్ క్యాంపు నిర్వహించబడుతుందన్నారు. ఉదయం కరాటే, సాయంత్రం డ్రాయింగ్, మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, సైన్స్ ప్రయోగాలు వంటి అనేక అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తికల్గిన విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపును అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాజప్ప, దొరబాబులకు ప్రజా మేనిపేస్టో అందజేత





ప్రజా మేనిఫెస్టో ప్రతులను స్వీకరిస్తున్న రాజప్ప, దొరబాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి తెలుసుకున్న సమస్యలు, ప్రజావసరాలతో రూపొందించిన ప్రజా మేనిపేస్టో ప్రతులను సోమ వారం పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిడిపి, వైసిపిల ఎంఎల్‌ఎ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న నిమ్మకాయల చినరాజప్ప, దవులూరి దొరబాబులకు అందచేశారు. ఈ సందర్భంగా మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ మేనిఫెస్టోను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కోరుకొండ ప్రశాంత్, గుమ్మడి చిన్ని, అల్లాడ జగదీష్, అనంతపల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరి కాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తా వం పై ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌కు తగదని టిడిపి నాయకులు కామాడి మాతరాజు, వనమాడి నూకరాజు అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం గాడిమొగ గ్రామంలో ఎంఎల్‌ఎ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో తమపై తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కుట్రలు చేశారని అన్నారు. ఆయన చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ జడ్‌పిటిసి సభ్యులు పెసింగి ఈశ్వరరావు, నాయకులు సంగాడి కామేశ్వరరావు, సీతారామరాజు, గాడిమొగ గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పల్లెల్లో రాజ్యమేలుతున్న మద్యం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సార్వత్రిక ఎన్నికల పురస్కరించుకుని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎలక్షన్ కమిషన్ ఆంక్షలు విధించడంతో మద్యం షాపులలో అమ్మకాలపై ఆంక్షలు విధించింది. టార్గెట్ పూర్తయితే మధ్యాహ్నం అయినా సరే షాపు మూసివేయాలి. ఇది అదనుగా మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది ముందుగానే బాటిల్లను స్కాన్ చేసి పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో పల్లెల్లో రాత్రులు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తూ బాటిల్‌పై అదనంగా రూ.50 వేసి మరీ అమ్ముతున్నారు. ఈ అమ్మకాలు కూడా మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది అందిస్తున్నారని పలువురు అంటున్నారు. మందుకు బానిసై చేసేది ఏమి లేక అదనంగా సొమ్ము చెల్లించి మరి ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. మండలంలోని ఆత్రేయపురం లొల్ల, మెర్లపాలెం, వద్దిపర్రు, బొబ్బర్లంక తదితర గ్రామాల్లో పాన్ షాపులలో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నా ఎక్సైజ్ అధికారులు, ఎస్ఇబి అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని మద్యం పక్కదారి పట్టకుండా షాపులలోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు

వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని తొత్తరముడిలో సోమవారం వైసిపి నుంచి శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు భారీగా టిడిపిలో చేరారు. వీరికి పి.గన్నవరం నియోకవర్గం ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, రామచంద్రపురం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమన్నారు. కూటమి బలపరిచిన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, గంటి హరీష్ మాధుర్‌ను గెలిపించాలని కోరారు. తొలుత మండలంలోని శానపల్లిలంక, కె.జగన్నాథపురం గ్రామాల్లో గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయన గ్రామాలలో పర్యటించి ఇంటింటికీ తిరుగుతూ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పి.గన్నవరం నియోజకవర్గం సహ సమన్వయకర్త నామన రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీను, కార్యదర్శి కుడుపూడి బుజ్జి, జనసేన పార్టీ నాయకులు మద్దా చంటిబాబు, గుత్తుల బాబీ, జనసేన, బిజెపి, టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎంఎల్‌ఎ అభ్యర్థులు

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గంలోని దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ రావు తెలిపారు. ద్రాక్షారామంలో సోమవారం ఏర్పాటు చేసిన దళితుల ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. వైసిపి ప్రభుత్వం దళితులకు చేసిన అభివృద్ధి పనులను దష్టిలో ఉంచుకొని వచ్చే ఎన్నికల్లో పార్టీని తిరిగి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, పార్టీ నాయకులు పెట్టా శ్రీనివాసరావు, కోలమూరు శివాజీ, అబ్బర్వర్ శ్రీనివాసరాజు, తోకల శ్రీనివాసరావు, చెల్లి నాగేశ్వరరావు, కోటి వెంకటరావు, సాదే రాజేష్, పోల్నాటి ప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి ఇంత సంతోషం, పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజల కోరిక

ప్రజాశక్తి-ముమ్మిడివరం

కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు, విద్యావంతులు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి జంగా గౌతమ్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలో పార్టీ జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో గౌతమ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో, చదువుకున్న వారిలో ఆదరణ పెరిగిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న మోడీ, జగన్ ప్రభుత్వాలపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాలక పక్షాలు భయపడి అన్ని సామాజిక వర్గాల వారితో ప్రత్యేక సమావేశాలు పెట్టి రూ.కోట్లు వెచ్చించి ఉద్యోగులను ప్రలోభాలకు గురి చేస్తున్నాయన్నారు. నవరత్నాలకు ఓట్లు రావని తెలిసి సిఎం వైఎస్.జగన్ ఓట్లను గ్రామాల్లో పల్లెల్లో 2000 వేలకు ఓట్లు కొంటున్నారని, ప్రభుత్వం నియమించిన గృహ సారథుల ద్వారా 50,000 నుండి లక్ష రూపాయలు వెచ్చించి ఓట్లు కొంటున్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ రావాలని, ప్రధానిగా రాహుల్ గాంధీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అభివృద్ధి చేసే కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలు ఇష్టపడుతున్నారన్నారు. తొలుత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల నుంచి కాత్రేనికొన వరకూ రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.సూరిబాబు, యార్లగడ్డ రవీంద్ర, దేవరపల్లి రాజేంద్రబాబు, పచ్చమట్ల ఉదయ భాస్కర వర్మ, గోడి భాస్కరరావు, కాశి అచ్యుతరామయ్య, అయితాబత్తుల పండుబాబు, చంటిబాబు, మెండి రాజశేఖర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జంగా గౌతమ్‌ను సన్మానిస్తున్న నేతలు

ఇవిఎంలకు పటిష్ట భద్రత, రక్షణ

ప్రజాశక్తి-అమలాపురం

